## క్లుప్తంగా

### విద్యుత్ సరఫరాకు అంతరాయం నేడు

**తాటిచెట్లపాలెం:** అక్కయ్యపాలెం సెక్షన్ పరిధిలో హెచ్‌టీ లైన్లపై నిర్వహిస్తున్న నిర్వహణ, చెట్ల కొమ్మల తొలగింపు పనుల నిమిత్తం గురువారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు జోన్-1 ఈఈ బి.సింహాచలం నాయుడు ఒక ప్రకటనలో తెలిపారు. ఈమేరకు బాలయ్యశాస్త్రి లేఅవుట్, ఫుడ్ ఎక్స్, రాఘవేంద్ర హాస్పటల్ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

**జోన్-2 పరిధిలో అంతరాయం రేపు**

**సీతమ్మధార:** జోన్-2 సబ్ డివిజన్ పరిధిలో 11 కేవీ కరాస ఫీడర్, 11 కేవీ తెన్నేటినగర్ ఫీడర్, ఎస్ఎస్‌టీఎల్ సెక్షన్ పరిధిలో శుక్రవారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని ఈఈ బి.కె.నాయుడు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ మేరకు న్యూ కరాస, ఓల్డ్ కరసా, తెన్నేటినగర్ ఫీడర్ పరిధిలోని కనకదుర్గా, ఫంక్షన్ హాల్ జంక్షన్, మాధవధార, గాయత్రి విద్యా మందిర రోడ్డు, జనతా గ్యారేజ్ జంక్షన్, గ్యాస్ గొడౌన్, తెన్నేటినగర్‌ల్లో విద్యుత్ సరఫరా సరఫరా ఉండదన్నారు.

**మురళీనగర్ సెక్షన్ పరిధిలో..**

**మురళీనగర్:** జోన్-2 డివిజన్ మురళీనగర్ సెక్షన్ పరిధి అయ్యప్పనగర్ 11 కేవీ ఫీడర్‌లో నిర్వహణ పనుల కారణంగా శుక్రవారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఈఈ బీకే నాయుడు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు అయ్యప్పనగర్, వర్మా కాంప్లెక్స్ కూడలి ఏరియా, ఎన్‌జీజీవోస్ కాలనీ, సింగరాయిమెట్ట, మసీదు వీధి ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదని, వినియోగదారులు గమనించాలని కోరారు.

### 19న కుంతీమాధవ స్వామి చందనోత్సవం


కుంతీమాధవ స్వామి విగ్రహం

**పద్మనాభం:** పద్మనాభంలోని కుంతీమాధవ స్వామి ఆలయంలో స్వామి చందనోత్సవం ఈ నెల 19న నిర్వహించనున్నట్టు ఈవో నానాజీ బాబు తెలిపారు. 18న రాత్రి పది గంటలకు కుంతీ మాధవ స్వామి విగ్రహాన్ని చందనంతో అలంకరిస్తారు. 19న ఉదయం ఆరు గంటల నుంచి చందనం అలంకరణలో ఉన్న కుంతీ మాధవ స్వామిని దర్శించుకోవడానికి భక్తులకు ప్రవేశం కల్పిస్తారు.

### కూచిపూడిలో సత్తా చాటిన ప్రణవి


క్లాన్‌క్లేవ్-2024లో విజేతగా నిలిచిన ప్రణవి

**దాబాగార్డెన్స్ :** నగరానికి చెందిన చిన్నారి పినిశెట్టి ప్రణవి కూచిపూడి నృత్యంలో అద్భుత ప్రతిభ కనబరిచి విజేతగా నిలిచింది. ఇటీవల అంతర్జాతీయ స్థాయిలో థాయిల్యాండ్‌లోని అలెయన్స్ ప్రావిన్స్‌లో జరిగిన కల్చరల్ క్లాన్‌క్లేవ్-2024లో కూచిపూడి నృత్య ప్రదర్శన చేసి విజేతగా నిలిచింది. ఇప్పటికే ఎన్నో అవార్డులు, పథకాలు సాధించిన ఈ చిన్నారి భవిష్యత్‌లో మరిన్ని అవార్డులు గెలవాలని గురువు కూచిపూడి నాగచందన ఆకాంక్షించారు. ఆరేళ్ల వయస్సు నుంచి ప్రణవి కూచిపూడి నృత్యం చేస్తూ మంచి ప్రదర్శనలు ఇచ్చిందంటూ చిన్నారి తల్లిదండ్రులు పినిశెట్టి రమేష్‌బాబు, నవ్యను పలువురు అభినందించారు.

# మహిళలదే ముందడుగు


సీతంపేట వీటీ హైస్కూల్ పోలింగ్ కేంద్రం వద్ద క్యూలో బారులు తీరిన మహిళా ఓటర్లు (ఫైల్)

- ఎమ్మెల్యే అభ్యర్థుల గెలుపుపై మహిళా ఓటర్ల ప్రభావం
- పురుషుల కంటే అధికంగా 4,442 మంది ఓటింగ్
- 'ఉత్తర'లో గతంలో కంటే పెరుగుదల

| 2024 ఎన్నికల్లో పోలైన ఓట్లు | |
|---|---|
| మొత్తం ఓటర్లు | 2,85,789 |
| ఓట్లేసిన వారు | 1,84,703 |
| పురుషులు | 90,124 |
| మహిళలు | 94,566 |
| ఇతరులు | 13 |
| పోలింగ్ శాతం | 64.63% |

**సీతంపేట:** ఉత్తర నియోజకవర్గంలో మహిళల ఓటింగ్ అధికంగా నమోదైంది. గతంలో కంటే ఈ ఎన్నికల్లో పెద్ద సంఖ్యలో మహిళా ఓటింగ్ శాతం పెరగడం విశేషం. నియోజకవర్గంలో మొత్తం ఓటర్లు 2,85,789 కాగా.. 1,84,703 మంది ఓటు హక్కు వినియోగించుకున్నారు. అందులో 90,124 మంది పురుషులు కాగా, 94,566 మంది మహిళలు ఉన్నారు. ఈ లెక్కన పురుషుల కంటే 4,442 మంది మహిళలు అధికంగా ఓటు వేశారు. మొత్తం పోలైన ఓట్లలో సగానికి పైగా మహిళ ఓటర్లు కావడం విశేషం. ఎమ్మెల్యే అభ్యర్థుల గెలుపులో ఫలితాన్ని నిర్ణయించే విషయంలో మహిళా ఓట్లు కీలకంగా మారాయి.

**మహిళలకు అండగా నిలిచిన ప్రభుత్వం**

గతంలో ఏ ప్రభుత్వం చేపట్టని విధంగా నవ రత్నాలతోపాటు సుమారు 21 రకాల సంక్షేమ పథకాలు ఐదేళ్లుగా వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అమలు చేసింది. ప్రతి పథకం తాలూకా లబ్ధి డీబీటీ, నాన్ డీబీటీ ద్వారా నేరుగా మహిళలకు చేరేలా చర్యలు చేపట్టింది. పిల్లల చదువు తల్లులకు భారం కాకుండా ప్రభుత్వం విద్యా రంగంలో అమ్మ ఒడి, విద్యా దీవెన, వసతి దీవెన, గోరు ముద్ద వంటి పథకాలతోపాటు నాడు-నేడు కార్యక్రమంతో ప్రభుత్వం పాఠశాలలను ఉన్న స్థితి నుంచి ఉన్నత స్థితికి తీసుకువచ్చారు. సొంతిళ్లు లేని కుటుంబం ఉండకూడదనే లక్ష్యంతో అర్హులైన ప్రతి మహిళకు వన్ సెంటు స్థలం, టిడ్కో ఇళ్లు అందజేశారు. ఉత్తర నియోజకవర్గంలో 28 వేల మందికి ఇళ్ల పట్టాలు, 7 వేల మందికి టిడ్కో ఇళ్లు, 26 వేల మందికి అమ్మ ఒడి, 12 వేల మందికి వైఎస్సార్ చేయూత, 37 వేల మందికి ఆసరా ఇలా ఎన్నో సంక్షేమ పథకాలు అందించి మహిళలు తమ కాళ్లపై తాము నిలబడేలా చేశారు.

**పార్టీల శ్రేణుల మధ్య చర్చ**

మునుపెన్నడూ లేని విధంగా ఉత్తర నియోజకవర్గంలో మహిళలు పెద్ద సంఖ్యలో ఓటు హక్కు వినియోగించుకోవడం ఎవరికి ప్రయోజనం కలిగిస్తుందన్న కోణంలో ప్రధాన పార్టీల శ్రేణుల మధ్య చర్చ జరుగుతోంది. 15 మంది అభ్యర్థులు అసెంబ్లీ బరిలో ఉన్న ఉత్తర నియోజకవర్గంలో వైఎస్సార్‌సీపీ, బీజేపీ(కూటమి) అభ్యర్థుల మధ్య ప్రధానంగా పోటీ నడుస్తోంది. మహిళల ఓట్లు ఏ పార్టీ అభ్యర్థిని వరించనున్నాయో వేచి చూడాల్సిందే. ఏది ఏమైనా అభ్యర్థుల భవితవ్యం తేలాలంటే జూన్ 4 వరకు ఆగాల్సిందే.

**పథకాల అమలుతోనే ఓటింగ్ పెరుగుదల!**

ఈ ఐదేళ్లలో రాష్ట్ర ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాలు మహిళలను బాగా ఆకర్షించాయి. మళ్లీ వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం వస్తేనే సంక్షేమ పథకాలు కొనసాగుతాయని వారంతా విశ్వసించారు. మహిళల ఓటింగ్ బాగా పెరగడానికి దీనినే ప్రధాన కారణంగా భావిస్తున్నారు. ఇదే వాస్తవ రూపం దాల్చితే ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ అభ్యర్థి విజయానికి కారణమవుతుంది. టీడీపీ ప్రకటించిన సూపర్ సిక్స్ పథకాలు చంద్రబాబు అమలు చేయడనే అపనమ్మకం మహిళల్లో కలిగిందని ప్రచారం జరుగుతోంది.

# వైఎస్సార్‌సీపీ విజయం పక్కా


వైఎస్సార్‌సీపీ ఉత్తర ఎమ్మెల్యే అభ్యర్థి కె.కె.రాజుతో చర్చిస్తున్న డిప్యూటీ మేయర్ కటుమూరి సతీష్, పార్టీ నాయకులు

- 'ఉత్తర'లో ఓటింగ్ తీరుపై డిప్యూటీ మేయర్, పార్టీ నాయకులతో కె.కె.రాజు చర్చ

**సీతమ్మధార:** సార్వత్రిక ఎన్నికలు ముగిసిన సందర్భంగా బుధవారం సాయంత్రం వైఎస్సార్‌సీపీ ఉత్తర నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి కె.కె.రాజును పార్టీ కార్యాలయంలో జీవీఎంసీ డిప్యూటీ మేయర్ కటుమూరి సతీష్, పలువురు పార్టీ నాయకులు కలిశారు. నియోజకవర్గంలో జరిగిన పోలింగ్, ప్రజలు ఓట్లు వేసిన తీరుపై కొద్దిసేపు చర్చించారు. 2019 ఎన్నికల్లో 62.85 శాతం ఓటింగ్ జరగ్గా.. 2024లో 64.63 శాతం ఓటింగ్ నమోదై సుమారు 1.78 శాతం పెరగడంపై మాట్లాడుకున్నారు. ఓటర్ల సంఖ్య పెరగడంతో కచ్చితమైన మెజారిటీ తమకు వస్తుందని అంచనా వేసుకున్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అందించిన సంక్షేమ పథకాలతోపాటు చేపట్టిన అభివృద్ధిని ప్రజలు చూసి ఫ్యాన్ గుర్తుకు ఓట్లు వేశారని భావించారు. ఉత్తరలో తప్పనిసరిగా కె.కె.రాజు విజయం తథ్యమని డిప్యూటీ మేయర్ కటుమూరి సతీష్ జోస్యం చెప్పారు.

## జీవ వైవిధ్య దినోత్సవ పోస్టర్ ఆవిష్కరణ

**ఏయూ క్యాంపస్:** ఈ నెల 22, 23 తేదీల్లో విశాఖపట్నం వేదికగా అంతర్జాతీయ జీవ వైవిధ్య దినోత్సవం నిర్వహించనున్నారు. కార్యక్రమ పోస్టర్‌ను బుధవారం ఏయూ వీసీ ఆచార్య పి.వి.జి.డి.ప్రసాదరెడ్డితో కలిసి నేషనల్ బయోడైవర్సిటీ అథారిటీ కార్యదర్శి డాక్టర్ బి.బాలాజీ ఆవిష్కరించారు. అనంతరం బాలాజీ మాట్లాడుతూ ఈ నెల 22న బీచ్ రోడ్డులోని ఏయూ కన్వెన్షన్ సెంటర్‌లో సదస్సు, ఎగ్జిబిషన్ నిర్వహిస్తామని తెలిపారు. 23న కూడా ఎగ్జిబిషన్ కొనసాగుతుందని, ఏయూ వృక్షశాస్త్ర విభాగంలో జాతీయ సదస్సు జరుగుతుందన్నారు. ఏపీ బయోడైవర్సిటీ బోర్డ్ మెంబర్ సెక్రటరీ బి.వి.ఎ.కృష్ణమూర్తి మాట్లాడుతూ జీవవైవిధ్య పరిరక్షణ దిశగా చేసే కార్యక్రమాలకు తాము సహకారం అందిస్తామన్నారు. వీసీ ప్రసాదరెడ్డి మాట్లాడుతూ బయో డైవర్సిటీ పార్క్‌ను ఏయూలో ఏర్పాటు చేస్తామన్నారు. ఏయూ వేదికగా వెయ్యి స్టార్టప్ సంస్థలు పనిచేయడం లక్ష్యంగా పనిచేస్తున్నామని చెప్పారు. రిజిస్ట్రార్ ఆచార్య ఎం.జేమ్స్ స్టీఫెన్, వృక్షశాస్త్ర విభాగాధిపతి సంధ్య దీపిక తదితరులు పాల్గొన్నారు.

## నిరంతర అన్నదాన సేవలకు రెండేళ్లు

- ధ్యాన మందిరంలో కమ్యూనిటీ ఫ్రిడ్జ్‌ల ద్వారా ఆహారం పంపిణీ


కమ్యూనిటీ ఫ్రిడ్జ్‌లో భద్రపరచిన ఆహారాన్ని అన్నార్తులకు అందిస్తున్న నూకల శేషగిరిరావు

**తాటిచెట్లపాలెం:** రైల్వే న్యూకాలనీ రైల్వే ఎగ్జిబిషన్ గ్రౌండ్స్ ఎదురుగా గల షిర్డీసాయిబాబా ధ్యాన మందిరంలో నిరంతర అన్నదానం కోసం ఏర్పాటు చేసిన కమ్యూనిటీ ఫ్రిజ్‌లకు రెండేళ్లు పూర్తయ్యాయి. ధ్యాన మందిరంలో కొన్నేళ్లుగా నిరాటంకంగా కొనసాగుతున్న నిత్యాన్నదాన కార్యక్రమానికి మరింత ప్రోత్సాహమిచ్చేలా ఇంటర్నేషనల్ వైశ్ ఫెడరేషన్ సహకారంతో 2022 మే 16న రెండు కమ్యూనిటీ ఫ్రిడ్జ్‌లు ఏర్పాటు చేశారు. మధ్యాహ్నం జరుగుతున్న అన్నదానంలో పాల్గొంటున్న వారికి అదనంగా 24 గంటలు ఏ సమయంలోనైనా ఆకలితో ఉన్నవారు ఈ ఫ్రిడ్జ్‌ల్లో నుంచి ఆహారం తీసుకోవచ్చు. ప్రతి రోజు వీటిలో ఆహారాన్ని ప్యాకెట్ల రూపంలో భద్రపరుస్తున్నారు. రెండేళ్లుగా ప్రతి రోజు కనీసం 50 నుంచి 100 మంది ఆకలిని తీర్చగలిగినందుకు తమకెంతో సంతోషంగా ఉందని ధ్యాన మందిర వ్యవస్థాపక అధ్యక్షులు నూకల శేషగిరిరావు, త్రిపురాన రాంబాబు తెలిపారు.

## వీరభద్ర విజయం.. విశిష్ట కావ్యం


మాట్లాడుతున్న ఆచార్య అయ్యగారి సీతారత్నం

**సీతంపేట:** సహృదయ సాహితి సంస్థ ఆధ్వర్యంలో రాజేంద్రనగర్ ప్రిజమ్ కళాశాలలో బుధవారం 'పోతన వీరభద్ర విజయం' అనే అంశంపై ఆంధ్రా యూనివర్సిటీ ఆచార్యులు డాక్టర్ అయ్యగారి సీతారత్నం ప్రసంగం జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పోతన వీరభద్ర విజయం భాగవతానికి ముందే రాశారని ఆరుద్ర నిరూపించారన్నారు. పోతన ఈశ్వర భక్తి ఈ కావ్యంగా స్పష్టమవుతుందని, అనంతర కాలంలో భాగవతం రాసేటప్పటికీ ఏకేశవరో పాసన హరిహర అభేదం తెలుస్తుందన్నారు. వీరభద్ర విజయంలోని పద్యాలను పరిశీలిస్తే పోతన శైలి, శబ్దాలంకార ప్రీతి సుస్పష్టమవుతుందన్నారు. లాటానుప్రాసం, వృత్యానుప్రాసం అద్భుతంగా ప్రయోగించారని చెప్పారు. సహృదయ సాహితి అధ్యక్షుడు శేఖరమంత్రి ప్రభాకర్ మాట్లాడుతూ వీరభద్ర విజయం మంచి కవిత్వ పటుత్వంతో రాసిన కావ్యమని తెలిపారు. దీని మూలం వాయు పురాణంలోనిదన్నారు. డాక్టర్ డి.వి.సూర్యారావు మాట్లాడుతూ పోతన రాసిన వీరభద్ర విజయం శైవమత ప్రధాన మైనదని, శివుడి జటాజూటం నుంచి ఉద్భవించిన వీరభద్రుడు, దక్షుని సంహరించుట ప్రధాన ఇతివృత్తమని వివరించారు. కార్యక్రమంలో డాక్టర్ కె.జి.వేణు, ఎస్.విజయ్‌కుమార్, పలువురు కవులు, రచయితలు పాల్గొన్నారు.

## ఆధ్యాత్మిక భావాలు అలవరచుకోవాలి

**కొమ్మాది:** నేటి తరం యువత ఆధ్యాత్మిక భావాలు అలవరచుకోవాలని సుందర్ గోపాల్ ప్రభు సూచించారు. భీమిలి బీచ్ రోడ్డు సాగర్‌నగర్ ఇస్కాన్ మందిరంలో రెండో రోజు నిర్వహించిన ఇస్కాన్ ఇండియా యూత్ కౌన్సిల్(ఐఐవైసీ) సమావేశంలో బుధవారం ఆయన ప్రసంగించారు. ప్రపంచ వ్యాప్తంగా లక్షలాది మందికి సనాతన ధర్మాన్ని బోధించే కార్యక్రమంలో భాగంగా ఈ సమావేశాలు ఏర్పాటు చేస్తున్నట్లు ఆయన తెలిపారు. ఆధ్యాత్మిక భావాలు మనిషిని కష్ట సుఖాల్లో నిలబెడతాయని, మానసిక ప్రశాంతత లభిస్తుందని పేర్కొన్నారు. అనంతరం ఇస్కాన్ ఆలయంలో గల శ్రీ రాధాకృష్ణులకు, జగన్నాథ, సుభద్ర, బలభద్ర స్వాములకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. భాగవత ప్రవచనాలు ఉదయం 4.30 గంటల నుంచి ప్రత్యేక హారతి కార్యక్రమాలు, నగర సంకీర్తన నిర్వహించారు. సమావేశాల్లో స్వామీజీ పరివ్రాజిక స్వామి మహారాజ్, రాధేశ్యామ్ ప్రభు, సాగర్‌నగర్ ఇస్కాన్ అధ్యక్షులు సాంబదాస్ ప్రభూజీ, మాతాజీ నితాయి సేవిని పాల్గొన్నారు.

## తాటిముంజలకు భలే గిరాకీ

- డజను రూ.50 నుంచి రూ.60
- ఆసక్తి చూపుతున్న ప్రజలు


డీఆర్ఎం కార్యాలయం వద్ద తాటిముంజలు అమ్ముతున్న గీత కార్మికులు

**అల్లిపురం:** వేసవి వచ్చిందంటే చాలు.. అందరికీ గుర్తుకొచ్చేవి తాటికాయలు. నగరంలో తాటికాయలు దొరకడం కష్టం కావడంతో నగర శివార్లు ఆనందపురం, తగరపువలస, పెందుర్తి, చింతల అగ్రహారం, కొత్తవలస తదితర ప్రాంతాల నుంచి గీత కార్మికులు తీసుకొచ్చే తాటిముంజలకు జనం ఎగబడుతున్నారు. దొండపర్తి డీఆర్ఎం కార్యాలయం రోడ్డులో తాటిముంజల వ్యాపారులు వాటిని విక్రయిస్తున్నారు. డజను రూ.50 నుంచి రూ.60 వరకు వీటి ధర పలుకుతోంది. వేసవి వేడికి తాటిముంజలు ఉపశమనం కావడంతో జనం వాటిని కొనుగోలు చేసేందుకు ఆసక్తి చూపుతున్నారు.



### కోదండరాముడి పుష్పయాగానికి పూల తరలింపు

**ఎంవీపీ కాలనీ:** తిరుపతి శ్రీకోదండ రాముడి పుష్పయాగానికి విశాఖ నుంచి పూలు తరలివెళ్లాయి. ఆధ్మాతిక వేత్త హిమాంశు ప్రసాద్ ఆధ్వర్యంలో జిల్లాలలోని వివిధ ప్రాంతాలలో సేకరించిన పూలును బుధవారం ఎంవీపీలోని టీటీడీ ఈ- దర్శనం కౌంటర్ వద్ద భక్తుల సందర్శనార్థం ప్రదర్శించారు. తిరుమలలో ఉత్సవాల్లో భాగంగా జరిగే పుష్పయాగానికి ఈ పూలు తరలిస్తున్నట్లు హిమాంశు ప్రసాద్ తెలిపారు. కలువలు, తామరలు, తులసి, మల్లి ఇలా వివిధ రకాలకు చెందిన 15 వేల పూలను సేకరించామన్నారు. ఈ పూలకు సంకల్పం చేసి అనంతరం బుధవారం సాయంత్రం తిరుమల తరలించామన్నారు. కార్యక్రమంలోమ పలువురు ఎంవీపీ వాసులు, వెంకటేశ్వస్వామి భక్తులు పాల్గొన్నారు.

# అభివృద్ధిలో ఆదర్శం


సిద్ధార్థనగర్‌లో చేపట్టిన సీసీ రోడ్డు, డ్రైనేజీ పనులు.. ఏర్పాటు చేసిన బోరు


54వ వార్డు జ్యోతినగర్‌లో నిర్మించిన బీటీ రోడ్డు

- 54వ వార్డుకు మహర్దశ
- రూ.2.47 కోట్లతో అనేక పనులు
- బీటీ, సీసీ రోడ్లు, డ్రైనేజీల నిర్మాణం
- స్థానికులు, పాదచారుల హర్షం

**కంచరపాలెం:** జీవీఎంసీ 54వ వార్డు అభివృద్ధిలో ఆదర్శంగా నిలిచింది. వార్డులోని కంచరపాలెం, 104 ఏరియా, మర్రిపాలెం పరిధి జ్యోతినగర్, బాపూజీనగర్, మహారాణి వీధి, సిద్ధార్థనగర్, గణపతినగర్, దేవేంద్రనగర్, రవీంద్రనగర్, రెడ్డి కంచరపాలెం ప్రాంతాల్లో అనేక నిర్మాణాలు చేపట్టి ప్రజల కోసం మౌలిక సదుపాయాలు కల్పించారు. గత టీడీపీ హయాంలో జరగని అభివృద్ధి.. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం చేసి చూపించింది.

**నాడు ఇదీ పరిస్థితి**

ఈ వార్డులోని పలు ప్రాంతాల్లో సీసీ, బీటీ రోడ్లు గోతులమయంగా మారడం, బీఆర్‌టీఎస్ రహదారుల్లోని ఫుట్‌పాత్‌లు ఆక్రమణకు గురికావడంతో వాహన చోదకులు, పాదచారులు రాకపోకలకు నానా ఇబ్బందులు పడేవారు. ఇక్కడి నడక మార్గాలు అధ్వానంగా ఉండటంతో మౌలిక వసతులు కల్పించడానికి కష్టతరంగా ఉండేది. ఎన్నో ఏళ్లుగా వృద్ధులు, పిల్లలు, దివ్యాంగులు శిథిల మార్గాల్లో నడిచేందుకు నానా తంటాలు పడేవారు. ఈ సమస్యలపై గత టీడీపీ ప్రభుత్వంలో స్థానికులు ఎన్ని ఫిర్యాదులు చేసినా.. పట్టించుకునే నాథుడే కరువయ్యాడు.

**నేడు మారిన స్థితి**

వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చాక జీవీఎంసీ వార్డుల అభివృద్ధి పెద్దపీట వేసింది. దీంతో 54వ వార్డుకు మహర్దశ పట్టింది. ప్రజల సౌకర్యార్థం అనేక అభివృద్ధి పనులు చేపట్టారు. వార్డులో సీసీ, బీటీ రోడ్లు, డ్రైనేజీలు, కాలువలు, గెడ్డలు, గెడ్డలకు రక్షణ గోడలు నిర్మించారు. బోర్లు ఏర్పాటు చేశారు. గత రెండేళ్లలోనే సుమారు రూ.2.47 కోట్లతో అభివృద్ధి పనులు నిర్వహించారు. జీవీఎంసీ స్టాండింగ్ కమిటీ సభ్యురాలు, వార్డు కార్పొరేటర్ చల్లా రజిని కౌన్సిల్‌లో నిధులు మంజూరు చేయించి వార్డు అభివృద్ధికి విశేష కృషి చేశారు. వైఎస్ జగన్ ప్రభుత్వంలో జరుగుతున్న అభివృద్ధి పనులపై వార్డు ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

**చురుగ్గా అభివృద్ధి పనులు**



ఈ వార్డులో ఎన్నో ఏళ్లుగా నివసిస్తున్నాం. మౌలిక వసతుల కల్పన, అభివృద్ధి జాడ ఏనాడు కనిపించలేదు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వార్డుల అభివృద్ధికి ఎంతో కృషి చేస్తోంది. జీవీఎంసీ నిధులు పుష్కలంగా మంజూరు చేయడంతో అభివృద్ధి పనులు చురుగ్గా చేపట్టారు. – లక్ష్మి రెడ్డి, బాపూజీనగర్

**మౌలిక సదుపాయాలు కల్పించారు**



ప్రజలకు మౌలిక సదుపాయాలు కల్పించేందుకు రాష్ట్ర ప్రభుత్వం, జీవీఎంసీ కృషి చేయడంతో సమస్యలు పరిష్కారమయ్యాయి. శిథిలావస్థను నుంచి స్మార్ట్‌గా 54వ వార్డును అభివృద్ధి చేశారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మళ్లీ ముఖ్యమంత్రిని చేసుకుంటాం.– బాకీ భానుమతి, 104 ఏరియా

**వార్డు అభివృద్ధికి కృషి**



మురికివాడలను అభివృద్ధి చేయడం ఎంతో కష్టంతో కూడిన పని. ప్రజలకు మౌలిక వసతులు అందించాలనే నా కృషికి రాష్ట్ర ప్రభుత్వం, జీవీఎంసీ, ఎంపీ నిధులు మంజూరు కావడంతో వార్డును అభివృద్ధి పథంలో నడిపిస్తున్నాను. – చల్లా రజిని, జీవీఎంసీ స్టాండింగ్ కమిటీ సభ్యురాలు, కార్పొరేటర్

# బెట్టింగ్ బంగార్రాజులు



- 'తూర్పు'లో జోరుగా పందేలు
- రూ.కోట్లకు చేరుకున్న జూదం

**ఆరిలోవ:** 'మా పార్టీ అభ్యర్థి గెలుస్తాడు.. మా పార్టీ అభ్యర్థి మెజారిటీ ఇంత.. మీ పందెం రూ.లక్ష.. మాది రూ.70 వేలు'అంటూ ఇప్పుడు తూర్పు నియోజకవర్గంలో పందేల జోరు హోరెత్తుతోంది. ఎన్నికల పోలింగ్ ముగియడంతో బెట్టింగ్ రాయుళ్లకు పండగలా ఉంది. సగటున రూ.లక్షలు పందెం కాస్తుండగా.. మొత్తంగా కలిపి రూ.కోట్లకు చేరినట్లు తెలుస్తోంది. వివిధ పార్టీల అభ్యర్థులు విజయం సాధిస్తారని.. అదే సమయంలో వారికి వచ్చే మెజారిటీపై కూడా పందేలు నడుస్తున్నాయి. ప్రస్తుతానికి ఎన్నికల ఫలితాలకు దాదాపు 20 రోజులు సమయం ఉన్నందున ప్రాథమికంగా రూ.లక్షల్లో పందేలు కడుతున్నారు. ఫలితాల రోజు దగ్గర పడుతున్న కొద్దీ బెట్టింగ్‌లు ఘననీయంగా పెరిగే అవకాశాలు ఉన్నాయి. పొలిటికల్ బెట్టింగ్ విషయంలో పందెంరాయుళ్లు సర్వేలను కూడా ఆధారం చేసుకుంటున్నారు. మొత్తానికి రానున్న మూడు వారాల పాటు బెట్టింగ్ వ్యవహారం జోరుగా సాగనుంది.

సుమారు రెండు నెలలుగా తూర్పులో అసెంబ్లీ అభ్యర్థుల తరఫున అనుచరులు చేసిన హడావిడి అంతాఇంతా కాదు. ఈ నెల 13న జరిగిన పోలింగ్‌తో ప్రచారాలకు బ్రేక్ పడింది. ఇప్పుడు బెట్టింగ్ హడావిడి నెలకొంది. ప్రధానంగా వైఎస్సార్‌సీపీ, టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థులపై పందేల జోరుకు తెరతీశారు. ఆయా పార్టీల నాయకులు రూ.లక్షల్లో పందేలు కాస్తున్నారు. పోలింగ్ బాగా జరిగిందని, ప్రజలు మా పార్టీకే ఎక్కువ ఓట్లు వేశారని ఎవరికి వారు ధీమా వ్యక్తం చేస్తున్నారు. ఈ ధీమాతో రూ.లక్షలు పందేలు కాస్తున్నారు.

**పందేలకు మధ్యవర్తిత్వం**

వరుసగా మూడుసార్లు ఎమ్మెల్యేగా గెలిచిన వెలగపూడి మళ్లీ నాలుగోసారి కూడా గెలవడం కాయమంటూ టీడీపీ నాయకులు ధీమా వ్యక్తం చేస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వం అందించిన సంక్షేమ పథకాలు అందుకుంటున్న వారంతా వైఎస్సార్‌సీపీకే ఓటు వేశారని, అందుకే ఎంవీవీ సత్యనారాయణ ఈసారి ఎమ్మెల్యేగా గెలవబోతున్నారంటూ ఆ పార్టీ నాయకులు ధీమాతో ఉన్నారు. అందుకే ఎవరికి వారు మా అభ్యర్థి గెలుస్తారు అంటే, మా అభ్యర్థే గెలుస్తారని పందేలకు దిగుతున్నారు. ఈ పందేలపై మధ్యవర్తుల సమక్షంలో అగ్రిమెంట్లు రాయించుకుంటున్నారు. పందేలు కాసిన ఇరువురి డబ్బులు ఆ మధ్యవర్తుల వద్ద భద్రపరుస్తున్నారు. కౌంటింగ్ పూర్తయిన వెంటనే గెలిచిన అభ్యర్థి తరఫున పందెం కాసిన వ్యక్తికి ఆ డబ్బులు ఇచ్చేస్తారు. మధ్యవర్తులుగా వ్యవహరించినందుకు ఓడిపోయిన వ్యక్తి డబ్బుల్లో 5 శాతం వారు తీసుకొనే విధంగా అగ్రిమెంట్‌లో ముందుగా రాయించుకుంటున్నారు. ఈ పందేల సందడి ఆరిలోవ, మద్దిలపాలెం, ఎంవీపీకాలనీ, పెదవాల్తేరు ప్రాంతాలలో ఎక్కువగా కనిపిస్తోంది. ఇదిలా ఉండగా మితిమీరిన ధీమాతో కొందరు అప్పులు చేసి పందేలు కాస్తుండడం ఆందోళన కలిగిస్తోంది. ఆ అప్పుల కోసం సొంత ఇంటి పత్రాలు షూరిటీగా పెడుతున్న ఘటనలు వెలుగు చూస్తున్నాయి. పార్టీల అభ్యర్థులపై ఉన్న మితిమీరిన అభిమానం వారికి చేటు చేస్తుందని పలువురు అభిప్రాయ పడుతున్నారు. ఈ మాయా జూదానికి పోలీసులు కూడా అడ్డుకట్ట వేయాలని కోరుతున్నారు.